# షేక్ భానత్

- వారణాసి రామకృష్ణ

ఈ మధ్య చిత్రమైన సంగతొకటి జరిగింది! చిత్రమైనదనీ ఎందుకు అంటున్నానో తర్వాత్తర్వాత తెలుస్తుంది గాని, మొదట జరిగింది సావకాశంగా దయచేసి చిత్తగించగలరు.

నేనొక కెమెరామెన్ని! టీ.వీలో మీరు ప్రోగ్రాములు గట్రా చూస్తుంటారు చూశారండి.... వాటిలో చాలా నేను తీసినవేనండి!

ఇకపోతే - మా డైరెక్టరు గారున్నారండీ - ఆయనకి ఒక భార్యతో బాటు ఒక బామ్మర్దీ ఉన్నారండి!

ఈ బామ్మర్ది మహా సరదామనిషండీ బాబు - ఎంత సరదామనిషంటే - టీ.వీలో వచ్చే ప్రతి ప్రోగ్రాముకూ తానే ఏంకర్నయిపోయి సమర్పణల మీద సమర్పణలు చెయ్యాలని తెగ ఉబలాటపడుతుంటాడండి!

అయితే సదరు బామ్మర్దిని గాని పొరపాట్నైనా ఏ ఛానెల్లో చూడటం జరిగిందో - వాళ్ళు మాటాషేనండి!

అదేంటి? అని మీరు అమాయకంగా అడిగితే

"ఆయనగారి అందాల ఫేసు చూసిన తక్షణం ధనుర్వాతమో, పక్షపాతమో రావటం కంపల్సరీ!" ఇది నా డైలాగ్ అనుకుంటున్నారా కాదండీ బాబూ - సాక్షాత్తూ బామ్మర్ది బావగారైన డైరెక్టరు గారు బోలెడు మాట్లు వాపోతూ నాతో చెప్పిన డైలాగ్!

ఇన్ని గొప్ప గొప్ప లక్షణాలున్న బామ్మర్ది కామధ్య నటవిరించి అన్న బిరుదునిచ్చి ఓ సాంస్కృతిక సంస్థ వాళ్ళు సత్కారం చేశారండి!

వేదికమీద 'నటవిరించి' కాదు - వీడికి 'నటవిరిచి' అని ఇవ్వాల్సింది. అంటూ డైరెక్టరు గారు నా చెవిలో పళ్ళు పటపటమని కొరికినా - సభకి ముఖ్య అతిథి డైరెక్టరు గారే కనుక బామ్మర్ది నటన గురించి మాట్లాడక తప్పలేదు.

మైకు పట్టుకుని కన్నీళ్ళు కారుస్తూ (ఆనంద బాష్పాలని పైకి చెప్పేల్లేండి) బామ్మర్ది నటనా సామర్థ్యాన్ని ఆకాశానికెత్తేస్తూ - ఇంతటి మహా నటుడితో ఓ ప్రోగ్రాం తప్పకుండా చెస్తానని సభాముఖంగా ప్రకటించేశారండి!



ఈ విషయం చెప్పినప్పుడు డైరెక్టరుగారి హృదయం ఎంత నలిగిపోయి ఉంటుందో నేను ఊహించగలనండి!

పీత కష్టాలు పీతకున్నట్టే డైరెక్టరు కష్టాలు డైరెక్టుగా ఆయనవే కదండీ!

సరే - ప్రోగ్రాం చెయ్యాలని పైసలా చేశారు కాని "ఏ ప్రోగ్రాం చెయ్యాలో ఆలోచించవయ్యా!" అని. (కెమెరా) చేతిలో పెట్టేరండి! దాంతో నేను సుదీర్ఘంగా ఆలోచించి, ఆలోచించి, చించినట్టు నటించి - చివరాకరికి "డైరెక్టరు గారూ! టీ.వీలో రైతులకి ఉపయోగపడే కార్యక్రమాలు తీస్తున్నాం కదా. ఆ ఎపిసోడ్కి ఏంకర్గా 'మన బామ్మర్ది' గార్ని పెడదామండి!" అన్నాను.

వెంటనే ఆయన సీరియస్గా "ఏమిటీ! మన బామ్మర్దా?" కేక వేశాడు గట్టిగా.

దాంతో నేను కంగుతిని, చేసిన తప్పు తెలుసుకుని -

"మరేనండి.... మీ బామ్మర్ది గార్ని...." అనేసి నాలక్కరుచుకున్నాను.

డైరెక్టరు గారు నన్ను ఎగాదిగా చూసి

"ఛా! నువ్వు మన బామ్మర్ది అన్నావని కాదు నేను కేకపెట్టింది - యాంకర్గా వాణ్ణి రైతుల కార్యక్రమాల్లో చూపిస్తే - రేపొద్దున్న రైతులంతా మూకుమ్మడి ఆత్మహత్యలు చేసుకుంటారని హడలి చచ్చాననుకో!" అన్నారు.

ఈ జవాబుకి మరింత కంగుతిని, తేరుకుని "పశువుల్లో ఆహార పుటలవాట్లు" అన్న ప్రోగ్రాంలో ఏంకర్గా 'మీ బామ్మర్ది' ప్రశ్నలు వేస్తారండి. దీనికి జవాబుల్ని డాక్టర్ పడిగొప్పుల శేషబాబు గారు ఇస్తారండి! ప్రోగ్రాం ఫైనల్ చేద్దాం!" అన్నాను. నేనిలా అనేసరికి డైరెక్టరు గారు మూగిలా అయిపోయి, ఆవేదనగా మొహం పెట్టి "తప్పదు.... కానీ" అన్నట్లుగా చేతులు పైకెత్తి అభినయించి విషాదంగా కుర్చీ లో కూలబడ్డారు.

బామ్మర్ది తొలిసారిగా మొహానికి రంగేసుకుని సెట్లో కొచ్చాడు. స్క్రిప్టు కాగితాలు ఇస్తే వాటిని చూసి "ఏంటి? తిండి గురించా ప్రోగ్రాం?" అన్నాడు.

"అవునండి! పశువుల్లో ఆహార అలవాట్లు గురించి...." చెప్పేలోగానే -

"ఏం తిండో! మనిషికీ, గొడ్డుకీ తిండి కావాలి!" వేదాంతం చెప్పే స్టైల్లో చెప్పి.

"మీరేం వర్రీ కాకండీ. నేనంతా చూసుకుంటాను!" అంటూ స్క్రిప్టు కాగితాలు

ప్రక్కకి పారేశాడు.

ఇక బామర్ది విజృంభించి కార్యక్రమాన్ని సమర్పించిన వైనం ఎట్టిదనిన -

బామర్ది కెమెరా వంక ఓసారి అయోమయంగా చూసి, నన్నూ ఓసారి కళ్ళు చికిలిస్తూ చూసి వెంటనే,

"నమస్కారం డాక్టర్ పందికొక్కుల శేషుబాబుగారూ!" అనేసరికి, ఎదురుగా కుర్చీలో కూర్చున్న డాట్రుగారు ఉలిక్కిపడి "అయ్యా ఏంకరూ - నాపేరు పందికొక్కుల కాదు, పడిగొప్పుల.... పడిగొప్పుల" అని ఎంత అరచి గీపెట్టినా బామర్ది మాత్రం వినిపించుకోకుండా ఆహార అలవాట్లు గురించి ఇంట్రడక్షన్ ఇస్తూ పోయేసరికి డాట్రుగారు రెండు చెవుల్లో వేళ్ళు పెట్టి, దురదపెడితే గోక్కుంటూ ఏమీ వినకుండా రుషిలా కళ్ళు మూసుకొని కూర్చున్నారు.

బామర్ది మాత్రం "మనిషికి కావల్సింది మొదట తిండి! తిండి లేనిదే మనిషి లేడు! మనిషి లేనిదే పశువు లేదు! మనం కాని పశువులు కాని పుట్టింది తింటానికే! అలా అని తిండి, ఎలా తినాలి, ఎంత శ్రద్ధతో తినాలి - ఇలా తినటంలో నిష్ణాతుడైన ఈ డాక్టర్‌గారు ఇప్పుడు సమాధానం చెబుతారు! డాక్టర్‌గారు - కాస్త వివరిస్తారా?" అని అడిగేసరికి డాట్రుగారు చెవుల్లోంచి వేళ్ళు తీసి గొంతు సర్దుకుని, ఓ సారి దగ్గు దగ్గి -

"ఆహార విషయాల్లో చాలా శ్రద్ధ తీస్కోవాలండి! ముఖ్యంగా మేత వేసినపుడు రెల్లుగడ్డి ఒంటికి చాలా మంచిదని గుర్తుంచుకోవాలండి!". చెప్పబోగా బామర్ది ఉలిక్కిపడి, అడ్డొస్తూ

"డాట్రుగారూ - మనుషులు రెల్లు గడ్డి తినటం ఎప్పుడూ వినలేదు!" అంటూ కందగడ్డ మొహం పెట్టి ఆగాడు. డాట్రుగారు మాత్రం సీరియస్‌గా నవ్వుతూ -

"అవునండీ! రెల్లుగడ్డిలో ముఖ్యంగా పైబరు శాతం ఎక్కువుంటుంది! ముఖ్యంగా...."

అంటూ ముఖ్యమైన విషయాలు చెప్పబోతూండగానే బామర్ది అనుమానంగా చూసి "రెల్లు గడ్డిలో పైబరు శాతం ఎక్కువుంటుందా? అసలేంటీ రెల్లు గడ్డి?" గట్టిగా అరిచాడు. అసలే బామర్ది మీద కోపంగా ఉన్న డాట్రు, బామర్దిని కళ్ళతోనే బాదేస్తూ "అవునండీ! పచ్చగడ్డిలో మంచి పోషక విలువలున్నాయి! కొండ ప్రాంతాల్లో ఏపుగా పెరిగే జొన్నగడ్డితో భాస్వరం, కాల్షియం లాంటి పదార్థాలతో బాటు విటమిన్లూ పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా...." చెప్పుకుపోతున్నారు.

"డాక్టరు గారూ! మనుషులు గడ్డి తినటం...."

అవును! మనుషులు గడ్డి తినటం.... గడ్డి తినే మనుషులుండటం మనం బాగా చూస్తున్నాం!" ముఖ్యంగా బీహార్లో కొందరు గడ్డంతా తినేయటంతో గడ్డికి కొరత ఏర్పడిందని తెలిసింది. ఈ కొరత ఇటీవల మధ్యప్రదేశ్‌లోనూ కనిపిస్తోందని, త్వరలోనే దక్షిణాది రాష్ట్రాలలోనూ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలుస్తోంది! ఏతావతా తెలుస్తున్న దేంటంటే, మేతకీ, కోతకీ అందకుండా బోలెడు పశుగ్రాసం కొందరి చేతల మూలాన అదృశ్యమైపోతోందని! పశుగ్రాసం చాలా అమూల్యం! దీన్ని జాతి సంపదగా అందరూ గుర్తించి కాపాడుకోవాలి! ముఖ్యంగా..."

"డాక్టరుగారూ! అసలు పశుగ్రాసం గురించి మీరెందుకు చెబుతున్నారు...."

"వర్షాకాలంలో బాగా పెరిగే యేనుగగడ్డితో బాటు కానుగ ఆకులు, మునగ ఆకులు, పచ్చపసరు ఆకులు చాలా శ్రేష్టమైనవి! వీటిలో మంచి పోషక విలువలతో బాటు శక్తి, అధిక బలాన్నిచ్చేందుకు కావల్సిన ప్రోటీన్లు, ఎమినో ఆసిడ్లు కూడా ఉన్నాయి!"

"ఆపండి డాక్టర్ పందికొక్కుల శేషు...." నెత్తీ నోరు బాదుకుంటూ బామర్ది చెప్తున్నా డాట్రుగారు మాత్రం పశువుల ఆహారం విజ్ఞాన విశేషాల్ని ఆపకుండా అదే ధోరణిలో కొనసాగిస్తూ -

"ఇప్పుడు చెప్పిన ఆకులేగాక జొన్నపిండి, రాగిపిండి కలిపిన కుడితినీళ్ళు వారానికి కనీసం మూడు సార్లయినా తాగించటం ఎంతయినా అవసరం. ముఖ్యంగా కుడితినీళ్ళల్లో...." అంటుంటే బామర్ది గాభరాగా చూసి,

"ఏమిటి? కుడితినీళ్ళా?" నిర్ఘాంతపోయి ఆగాడు.

"అవును! కుడితినీళ్ళే! కుడితినీళ్ళు తేలిగ్గా జీర్ణమవుతాయి! ముఖ్యంగా చూడి గేదెలకి కుడితినీళ్ళు ఇస్తే అవి ఆరోగ్యవంతమైన దూడల్ని ప్రసవిస్తాయి. ఇక పాడిగేదెల సంగతి చూస్తే - ముఖ్యంగా పాడిగేదెల్లో...."

స్క్రిప్టులో ఉన్నది ఉన్నట్టుగా డాట్రుగారు బాదేస్తూంటే, బామర్ది పార్కిన్‌సన్ జబ్బొచ్చిన వాడిలా తలవేగంగా ఊపుతూ, గిలగిలా తన్నుకుంటూ అప్పుడప్పుడూ నా (కెమెరా) వంక చూసి వెర్రినవ్వు నవ్వుతూ - మళ్ళీ పైకి ఏమీ అనలేక ప్రశ్నలు సంధిస్తూ -ముత్తానికి కార్యక్రమం ముగించాడు.

ఆ విధంగా సాగిన ఇంటర్వ్యూ తాలూకు వీడియో క్యాసెట్‌ని మాన్యుమెంట్‌లా కాపాడుకుందామని, వృద్ధాప్యంలో జీవితం మీ ఆశచావకపోతే అప్పుడీ ప్రోగ్రాం వేస్కుని చూ(చ)ద్దామని ఎంతో ప్లాన్ చేసి వీడియో క్యాసెట్‌ని నేను భద్రపరిస్తే - దాన్ని డెరెక్ట్రుగారు కాస్త ఎక్కడో పారేశారు.

పశువుల ఆహారం గురించి అడగాల్సిన ప్రశ్నల్ని మనుషులకనుకుని బామర్ది అడగటం, డాట్రుగారు స్క్రిప్టు ప్రకారంగా బాదుకుంటూ పోవటం, అనేదే నేను చెప్పాలనుకున్న చిత్రమైన సంగతి! - అని మీరనుకుంటున్నారా? ఎంతమాత్రం కాదండి! పొరబాటుగా రిమోట్ మీద వేలు పెట్టేసేరండి!

అసలు సంగతేమిటంటే -

ఎక్కడో పోయిందనుకున్న టేపుని బామర్దిగారు వెతికి పట్టుకుని ఏదో ఛానల్ వాళ్ళకివ్వగా ఓ శుభదినాన ఉగాది పండుగ రోజున పొద్దున్నే దాన్ని వాళ్ళు చక్కగా టెలికాస్ట్ చేశారు.

అయితే ఇంతటి మహత్తరమైన కార్యక్రమం ఏ ఛానెల్‌లో ప్రసారమయి వుంటుందో ఊహించి చెప్పగలరా? వెంటనే పోస్టుకార్డుపై రాసి పంపండి! అలా కరెక్టుగా రాసిన వాళ్ళకి కిలో ఉల్లిపాయలు బహుమతిగా పంపుతామని ప్రకటిస్తూ ప్రస్తుతానికి అమ్మా ఆబ్లిక్ అయ్యా - అదీ సంగతి! ఇక ఆ తర్వాత మీ ఓపిక!!

*

## ఇద్దరూ ఇద్దరే



బాల్‌ఠాక్రే, అమితాబ్ లిద్దరూ అంత సన్నిహితంగా మాట్లాడు కుంటున్నారు. ఇక్కడ మనం గమనించవ లసింది ఇద్దరూ మనస్తత్వాలకి చుక్కెదురు. ఒకరు ఎప్పుడూ కాంట్రవర్సీల్లోనే మునిగి తేలుతుంటారు. మరొకరు కాంట్రవర్సీలకు దూరంగా వుంటారు. వారిద్దరి సమావేశాలు, ముచ్చట్లు ఏ పరిణామానికి దారి తీస్తాయో వేచి చూద్దాం!